క్లుప్తంగా

సమస్య పరిష్కారంపై మహిళ హర్షం



డీఆర్వో చేతుల మీదగా నూతన రేషన్ కార్డు అందుకుంటన్న మహిళ

ఏలూరు రూరల్ : ప్రభుత్వం చేపట్టిన స్పందన కార్యక్రమంపై ఓ పేదింటి మహిళ హర్షం వ్యక్తం చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటాపురం ప్రాంతానికి చెందిన తిరుమలశెట్టి రామలక్ష్మి అనే మహిళకు గత ప్రభుత్వం వైట్ రేషన్‌కార్డు మంజూరు చేసింది. అయితే కార్డులో ఆమె కుమార్తె, కుమార్తు పేర్లులో నమోదు కాలేదు. దీంతో ఇటీవల అనారోగ్యానికి గురైన కుమార్తె ఆరోగ్యశ్రీ ద్వారా సేవలు పొందేందుకు ఆటంకం ఏర్పడింది. సమస్య పరిష్కరించమని కోరుతూ ఆమె సోమవారం ఏలూరు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. దీనిపై స్పందన ప్రత్యేక అధికారి, డీఆర్వో ఏవీఎన్ఎస్ మూర్తి ఆదేశాలు అనుసరించి తహసీల్దార్ బి.సోమశేఖర్ సాంకేతిక సమస్య పరిష్కరించి డీఆర్వో చేతుల మీదగా కొత్తకార్డు అందజేసారు.

గుట్టుచప్పుడు కాకుండా ఇసుక అమ్మకాలు

కుక్కునూరు : మండలంలోని పెద్దరావిగూడెం పంచాయతీలో రాత్రివేళల్లో ఇసుక అమ్మకాలు గుట్టుగా సాగుతున్నాయి. పెద్దరావిగూడెం పంచాయతీ పరిధిలోని పాములేరు వాగు తెలంగాణలోని ములకలపల్లి, కుక్కునూరు సరిహద్దు గ్రామాల మీదుగా ప్రవహిస్తుంది. దీనిని అవకాశంగా తీసుకున్న తెలంగాణకు చెందిన కొందరు వ్యక్తులు పాములేరువాగు నుంచి ఇసుకను రాత్రి వేళల్లో గుట్టుగా తరలించి పెద్దరావిగూడెం పంచాయతీలో అమ్మకాలు జరుపుతున్నట్టు సమాచారం. మండల అవసరాల నిమిత్తం ప్రభుత్వం రెండు ఇసుక ర్యాంపులు కేటాయించింది. అయినప్పటికి తెలంగాణ ప్రాంతం వారు మండలంలో ఇసుక అమ్మకాలు జరపడం విస్మయానికి గురిచేస్తుంది. ఆదివారం రాత్రి పది ట్రాక్టర్లలో ఇసుకను వెంకటాపురం పరిసరాలకు తరలించి అమ్మినట్టు సమాచారం. కాగా పక్క రాష్ట్రాల వారు మండలంలో ఇసుక అమ్మకాలు జరపడం బట్టి చూస్తే అధికారుల పర్యవేక్షణా లోపం కొట్టొచ్చినట్టు కనిస్తుందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో 100 సీట్లు ఖాళీ

దెందులూరు: కొవ్వలిలోని నియోజకవర్గ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో 100 సీట్లు ఖాళీగా ఉన్నాయని హాస్టల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గోల్డెన్ రాజు తెలిపారు. సోమవారం హాస్టల్‌లో విలేకర్లతో మాట్లాడుతూ 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 100 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు హాస్టల్‌లో సంప్రదించాలన్నారు.

జగనన్న సు'రక్షణ' కవచం

- పేదల సంక్షేమానికి కట్టుబడే నైతికత
- పూర్తి ఉచితంగా 11 రకాల సర్టిఫికెట్లు
- సచివాలయ కేంద్రంగా పారదర్శక పాలన
- నేటినుంచి ఇంటింటికీ జగనన్న దండు



ఏలూరులోని సచివాలయ భవనం (ఫైల్)

ఏలూరు టౌన్ : **నాడు** – '' ఏదైనా సర్టిఫికెట్ కావాలంటే ... ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతూ ఉండాలి. ఒక్కోసారి చెప్పులైనా అరిగేవి కానీ సర్టిఫికెట్ మాత్రం చేతికి అందని దుస్థితి. ఇక అధికారులు, సిబ్బంది జేబులు నింపితే గానీ పనులు అయ్యేవి కాదు. పేదలు, కార్మికులు, కూలీలు జీవనోపాధి వదులుకుని మరీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దైన్యస్థితి ఉండేది. గ్రామాల్లోని ప్రజలు మండల కేంద్రాలకు వ్యయప్రయాసలకు ఓర్చి పనులు చేయించుకోవాల్సి వచ్చేది. ''

నేడు – '' పేద వర్గాల ప్రజలకు జగనన్న సు'రక్షణ' కవచంలా మారాడు. గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేస్తూ సచివాలయ వ్యవస్థను తీసుకురావడం ద్వారా జవాబుదారీతనం వచ్చింది. ప్రజలే ప్రభుత్వం అని మాటల్లో వినటమే ... కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతల్లో చేసి చూపారు. దేశానికే ఆదర్శవంతమైన పాలన అందిస్తూ మరో వినూత్న కార్యక్రమానికి సీఎం జగన్ తెరతీశారు. నెలరోజుల పాటు ప్రజల ఇంటికే వెళ్లి సేవలు అందించేలా, సంక్షేమ పథకాలు అందని పేదలకు వాటిని అందించేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు. ''

సేవలే లక్ష్యంగా.. జగనన్న సురక్ష

గ్రామ, వార్డు సచివాలయాల్లో సర్కారు గరిష్టంగా 320 సేవలను ప్రజలకు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. వీటిలో నిత్యం ప్రజలకు అత్యంత ముఖ్యమైనవి 20 రకాల సేవలు ఉన్నాయి. ఇక వీటిలో 11 అంశాలకు సంబంధించి ప్రజలకు ప్రత్యేకంగా సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రూపొందించారు. సామాజికంగా పలు ఇబ్బందులతో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు పలువురు పేదలు, అర్హులైన వ్యక్తులు దూరం అవుతున్నారు. ఇప్పటికే గడపగడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యేలు, అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. మరోసారి వినూత్నమైన రీతిలో జగనన్న సురక్ష అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

ఏలూరులో జగనన్న సురక్ష ఇలా

ఏలూరు నగరంలో 80 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 5 సచివాలయాలను ఒక క్లస్టర్‌గా విభజించి 16 రోజులపాటు జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రత్యేకంగా క్యాంపును ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. నెలరోజులపాటు ఏలూరు నగరంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. జూలై 4 తేదీ నుంచీ ఆయా క్లస్టర్లలో క్యాంపును ఏర్పాటు చేస్తారు. మంగళవారం నుంచి ఏలూరు నగరంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకం అవుతారు. ముందుగా 6 రోజుల పాటు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల అవసరాలు గుర్తిస్తారు. వారితో యాప్‌లో దరఖాస్తు చేయించి 7వ రోజు క్యాంపులో వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టారు.

ఉచితంగా 11 రకాల సర్టిఫికెట్లు

జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రధానంగా ప్రజలకు అత్యవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తారు. గతంలో కార్యాలయాల చుట్టూ తిరిగి, చేతులు తడిపితేనే గానీ ఇవ్వని స్థితిలో.. నేడు ఉచితంగా, ఎక్కడికీ తిరగకుండానే ఇంటివద్దనే ఉచితంగా సర్టిఫికెట్లు అందించేలా జగనన్న ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కు ఫోన్ నెంబర్ అనుసంధానం, జనన ధ్రువీకరణ పత్రం, మరణ ధ్రువీకరణ పత్రం, మ్యుటేషన్ లావాదేవీలు, కుటుంబ సభ్యుడి ధ్రువీకరణ పత్రం, పంటసాగు హక్కు కార్డు, కొత్త లేదా స్ప్లిట్ రైస్ కార్డు, హౌస్ హోల్డ్ మ్యాపింగ్ విభజన పత్రాలను ఉచితంగా ఇస్తారు.

ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం



అత్యంత పారదర్శకంగా, ఇంటివద్దకే ప్రభుత్వ సేవలు అందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. జగనన్న సురక్షలో 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తాం. సమస్యలను పరిష్కరించటం, సంక్షేమ పథకాలు అర్హులకు అందించటమే ప్రధాన అజెండా,

– సంక్రాంతి వెంకటకృష్ణ,
ఏలూరు నగర కమిషనర్

పేదల సీఎం జగనన్న



దేశ చరిత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లాంటి నాయకుడ్ని ఎవరూ చూడలేదు. కేవలం పేదవర్గాల ప్రజల జీవితాలను బాగుచేసేందుకు మాత్రమే ఆయన నిత్యం పరితపిస్తున్నారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ ఇవ్వాలనే ఆశయంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

– పొలిమేర రామదాసు,
44వ డివిజన్ కార్పొరేటర్, ఏలూరు

చరిత్రలో ఒక్కడు .. జగనన్న



దేశంలో ఎక్కడైనా ఎన్నికల సమయంలోనే ప్రజా ప్రతినిధులు జనం వద్దకు ఓట్లు అడిగేందుకు వెళ్లటం పరిపాటి. కానీ చరిత్రను తిరగరాస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యేలు, అధికారులను నిత్యం ప్రజల్లోనే ఉండేలా చేయటం ద్వారా జవాబుదారీతనాన్ని తెచ్చారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని నిత్యం ప్రజల్లోనే ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ ప్రజల నాయకుడిగా ఉన్నారు.

– నున్న స్వాతి శ్రీదేవి, 48వ డివిజన్ కార్పొరేటర్, ఏలూరు

ఇంటివద్దకే ప్రభుత్వ సేవలు



అర్హులకు ఇంటివద్దకే సంక్షేమ పథకాలు అందించటం, పేదలకు ఉచితంగా సర్వీస్ చేయటం ప్రధాన అజెండాగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని సారథ్యంలో ఏలూరు నగరం, నియోజకవర్గంలో ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం, పార్టీ నాయకులు కృషి చేస్తున్నారు.

– బత్తిన విజయకుమార్,
27వ డివిజన్ కార్పొరేటర్, ఏలూరు

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ సోమశేఖర్‌ను సన్మానించిన చొదిమెళ్ల గ్రామస్తులు

ఏలూరు రూరల్ : ఏలూరు మండల తహసీల్దార్ బి.సోమశేఖర్‌ను సోమవారం చొదిమెళ్ల గ్రామస్తులు సన్మానించారు. ఇటీవల చొదిమెళ్లలో ఆక్రమణకు గురైన రహదారి సమస్యను తహసీల్దార్ పరిష్కరించి మార్గం చూపారు. ఇదే క్రమంలో గ్రామంలో ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకున్నారు. ఆయన సేవలను గుర్తించి స్థానిక కార్పొరేటర్ బత్తిన విజయకుమార్, దామిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు తహసీల్దార్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గాయత్రి, మండల సర్వేయర్ విశ్వనాథ్, సీనియర్ అసిస్టెంట్ నాగమణి, వీఆర్వో తాడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది భద్రతా నియమాలు పాటించాలి

జంగారెడ్డిగూడెం : విద్యుత్ సిబ్బంది విధుల నిర్వహణలో భద్రతా నియమాలను పాటించాలని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ సూచించారు. సోమవారం స్థానిక డివిజన్ కార్యాలయంలో జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించి, అనంతరం వారిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన లైన్ క్లియర్‌పొంది విద్యుత్ మరమ్మతులు నిర్వహించి ప్రమాదాలను అరికట్టాలన్నారు. అలాగే భద్రతా ఉపకరణాలను ఖచ్చితంగా ఉపయోగించాలన్నారు. ప్రామాణికం ఉన్న మెటీరియల్‌ను వినియోగించాలని సూచించారు. సప్లయ్ ఆపకుండా విద్యుత్ ఉపకరణాలపై పనిచేయరాదని సూచించారు. అలాగే గృహ వినియోగదారులు పాటించాల్సిన భద్రత ప్రమాణాలను వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ యు.సుబ్బారావు, ఏఈ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

స్వల్పంగా తగ్గిన వర్జీనియా పొగాకు ధరలు



కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో విక్రయానికి ఉంచిన బేళ్లు

కొయ్యలగూడెం : వర్జీనియా పొగాకు ధరలు స్వల్పంగా తగ్గాయి. సోమవారం కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో నిర్వహించిన వేలం ప్రక్రియలో రూ.7 నుంచి రూ.8 మేర ధర తగ్గింది. వేలం ప్రారంభించిన 75 రోజుల నుంచి పెరుగుతూ వెళ్లి 288/287 రూపాయలకు వర్జీనియా ధర చేరుకోగా ప్రస్తుతం సుమారు ఎనిమిది రూపాయలు తగ్గుముఖం పట్టింది. పెరుగుతూ వస్తున్న ధరలను చూసి రూ. 300కు చేరుకుంటుందని ఆశించామని అయితే ఒక్కసారిగా ధర తగ్గించడం పట్ల రైతుల్లో ఆందోళనకు కారణమైందని వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల నంది పేర్కొన్నారు. ధర ఆశాజనకంగా ఉండడంతో మిగిలి ఉన్న పొగాకును ఒక్కసారిగా వేలం కేంద్రానికి తీసుకురావడం జరిగిందని, అయితే పడిపోయిన ధరను చూసి నిరాశ చెందామని రైతులు వాపోతున్నారు. కంపెనీలు సిండికేట్‌గా వ్యవహరించి ధర తగ్గించాయని వారు ఆరోపిస్తున్నారు.

కుష్టును తొలి దశలో గుర్తించాలి

చింతలపూడి : కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించడం ద్వారా త్వరితగతిన వ్యాధిని నయం చేయవచ్చునని ఆరోగ్య విస్తరణ అధికారి అబ్రార్ హుస్సేన్ పేర్కొన్నారు. సోమవారం నుంచి జూలై 16వ తేదీ వరకు కుష్టు వ్యాధి గుర్తించడంపై జరుగుతున్న సర్వేను ప్రగడవరం, వెలగలపల్లి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, కనుబొమ్మలు కనురెప్పలకు వెంట్రుకలు రాలిపోవడం, చెవి తమ్మలు వాచి ఉండడం, కాళ్లు చేతులు స్పర్శ కోల్పోవడం, వేళ్లు వంకర తిరగడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాని సూచించారు. కార్యక్రమంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ అరుణ అవ్వమ్మ తదితరులు పాల్గొన్నారు .

రెడ్‌క్రాస్ సేవలు విస్తరించేలా కృషి



ఎంపీడీవోకు కమిటీల ఏర్పాటు పత్రాలను అందజేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలు విస్తరించే విధంగా ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా కార్యదర్శి బి.బిన్నీ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ కమిటీలను జిల్లాలోని అన్ని మండలాల్లో ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. మండల స్థాయి కమిటీల్లో తహసీల్దార్ కమిటీ అధ్యక్షులుగా, ఎంపీడీవో ఉపాధ్యక్షులుగా వ్యవహరిస్తారని అన్నారు. కమిటీల ఏర్పాటుకు సంబంధించి పత్రాలను ఎంపీడీవో వేణు గోపాలరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పారిజాతగిరిలో హుండీ లెక్కింపు

జంగారెడ్డిగూడెం : స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. ఏలూరు శనివారపుపేట గ్రూప్ టెంపుల్స్ ఈవో పి.రీనామాధురి పర్యవేక్షణలో హుండీ లెక్కింపు నిర్వహించినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. ఈ లెక్కింపులో 96 రోజులకు గాను రూ. 8,64,542 ఆదాయం వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు పి.జగపతి రాజు, దండు ధనరాజు, రెడ్డి రంగప్రసాద్, ములగలంపల్లి సేవా సమితి బృందం, భక్తులు పాల్గొన్నారు.

కొల్లేరు గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- పైడిచింతపాడులో గడపగడపకు మన ప్రభుత్వం



పైడచింతపాడులో సంక్షేమ పథకాలపై మహిళను ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

ఏలూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో కొల్లేరు గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సోమవారం ఏలూరు మండలం పైడిచింతపాడులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేపట్టిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కొల్లేరు గ్రామాల అభివృద్ధి కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసిందన్నారు. అంతర్గత సీసీరోడ్లు, డ్రైయినేజీ, ప్రధాన రోడ్లు నిర్మాణం, సచివాలయాల ఏర్పాటుతో ప్రజల వద్దకే పాలన అందిస్తున్నామన్నారు. పార్టీ, వర్గ భేదాలు లేకుండా అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకం అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రతి ఊరులో జగనన్న కాలనీ ఏర్పాటు చేశామన్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి ఇళ్ల స్థలాలు మెరక చేశామన్నారు. కొల్లేరులో పేదల సొంతింటి కల నెరవేర్చుతున్నామన్నారు. కొల్లేరు గ్రామాలకు సురక్షిత తాగునీరు అందించేందుకు కొత్త పైప్ లైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించామని గుర్తు చేశారు. సాయంత్రం 5 గంటలకు గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు సర్పంచ్ ముంగర తిమోతీ, ఉప సర్పంచ్ రేలంగి యోహాన్ ఆధ్వర్యంలో ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మహాత్మ గాంధీ, అంబేడ్కర్, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాల వేశారు. తర్వాత ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులను కలిసి సంక్షేమ పథకాల గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తేరా ఆనంద్, ముంగర సంజీవ్‌కుమార్, తహసీల్దార్ బి.సోమశేఖర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం సరళకుమారి, ఇంజినీరింగ్ అధికారులు కృష్ణమోహన్, మాదేపల్లి సర్పంచ్ కొరపాటి శ్రీరామ్‌ప్రభుదేవ్, పంచాయతీ వార్డు సభ్యులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాదకద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ చేయిస్తున్న సెబ్ అదనపు ఎస్పీ సూర్యచంద్ర రావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఏలూరు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ నక్క సూర్యచంద్రరావు పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు మాదక ద్రవాల్య వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల మనిషి నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని, దీనివల్ల విద్యార్థులు చదువులో వెనుకబడిపోతారన్నారు. దేశానికి వెన్నెముక అయిన విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడి వారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోరాదని హితవు పలికారు. మాదక ద్రవ్యాలు సేవించినా, కలిగి ఉన్నా చట్టప్రకారం నేరమని స్పష్టం చేశారు. విద్యార్థులు తమ చుట్టు పక్కల ఎవరైనా మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్నా, విక్రయిస్తున్నా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జీ రాజేశ్వరి మాట్లాడుతూ నేటి సమాజంలో మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిపోయిందని, ఇది సమాజానికి తీవ్ర నష్టం కలిగిస్తుందన్నారు. విద్యార్థులు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, సంఘ వ్యతిరేక శక్తులు విద్యార్థులనే లక్ష్యంగా చేసుకుని తమ కార్యకలాపాలు సాగిస్తున్నారని హెచ్చరించారు. సెబ్ సూపరింటెండెంట్ వి.అరుణకుమారి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సుమారు 1800 మంది విద్యార్థులతో మాదకద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. సెట్‌వెల్ సీఈఓ ఎండీహెచ్ మెహరాజ్, ఆశ్రం వైద్య కళాశాల సైకియాట్రిస్ట్ శ్రీనివాసరావు, రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్స్‌పాల్ బి.శ్రీనివాసరావు, సెబ్ అధికారులు ఎస్.శ్రీనివాసరెడ్డి, పి.సుబ్బారెడ్డి, జీఎస్‌కే ధనరాజ్, డి.ప్రసాద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	68	అరటి కాయ (1)	07
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	-
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	30	ములక్కాడలు	08-10
బెండకాయలు	30	కంద	48
పచ్చిమిర్చి	80-94	బీట్‌రూట్	38
కాకర కాయలు	54	కీరా దోస	44
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	-
బీరకాయలు (పందిరి)	52	అల్లం	230
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	20-40
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	24	చుక్కకూర	10
బంగాళదుంపలు	24	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	18	బఠాణీ	-
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	24

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	28
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	35
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	34
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	25
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	24
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	31
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	27
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	33